క్లుప్తంగా

వేణుగోపాల స్వామి కల్యాణం రేపు

భీమునిపట్నం: ఏకాదశి సందర్భంగా వేణుగోపాల స్వామి వార్షిక కల్యాణం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆర్.శింగరాచార్యులు బుధవారం తెలిపారు. ఇక్కడ శివ కేశవ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వేణుగోపాల స్వామికి వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం అత్యంత వైభవంగా కల్యాణం నిర్వహిస్తామని, అధిక సంఖ్యలో భక్తులు తరలి రావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా 33/11 కేవీ దాకమర్రి పరిధిలోని 11 కేవీ బోడమెట్టపాలెం వద్ద అల్లుపేట, భూమాత లే అవుట్, దాసరిపేట, రామునాయుడుపేట, రెల్లిపేట, నీలయమ్మ సత్రం కూడలి, గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో...

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ వుడా కాలనీ, ఐటీ హిల్ నంబర్ – 1 ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మధురవాడ సబ్ స్టేషన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామ్మూర్తి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు పోర్టు కాలనీ, ఎన్‌జీజీవోస్ లే అవుట్, సుద్దగెడ్డ, వాంబేకాలనీ, శ్రీనివాసనగర్, అయోధ్యనగర్, ఆర్టీసీ కాలనీ, మానం ఆంజనేయులు నగర్, సాక్షి పేపర్ ప్రెస్ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94931 77901లో సంప్రదించాలన్నారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు



సిబ్బందిని అభినందిస్తున్న సీఐ తిరుపతిరావు

ఆనందపురం: ఇటీవల కాలంలో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సీఐ టీవీ తిరుపతిరావు బుధవారం అభినందించి పురస్కారాలు అందించారు. హెచ్‌సీ ఎస్.ధనలక్ష్మి, కానిస్టేబుళ్లు ఎస్.ప్రసాద్, వై.శ్రీనును అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పురస్కారాలు సాధించాలని ఆయన సూచించారు.

కేంద్రానికి టీడీపీ, జనసేన తొత్తులు

తగరపువలస: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి టీడీపీ, జనసేన పార్టీలు తొత్తులుగా మారాయని కాంగ్రెస్ విశాఖ ఎంపీ అభ్యర్థి పి.సత్యారెడ్డి అన్నారు. బుధవారం తాళ్లవలసలో ఆయన మాట్లాడుతూ మూడు పార్టీల కూటమిని ఉత్తరాంధ్ర ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. తానూ భీమిలి ప్రాంతానికి చెందిన వాడినేనన్నారు. 53 చిత్రాలు నిర్మించిన తాను భీమిలిలో స్టూడియో నిర్మించి చిత్రపరిశ్రమను విశాఖకు తీసుకురావడానికి ప్రయత్నిస్తానన్నారు. భీమిలి అభ్యర్థి అడ్డాల వెంకట వర్మ, జిల్లా అధ్యక్షుడు గంపా గోవిందరాజు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ వాసులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన



తాళ్లవలస వద్ద అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తగరపువలస: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది తాళ్లవలసలోని అపార్ట్‌మెంట్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా కిందకు చేరుకోవాలి, మంటలు ఎలా అదుపు చేసుకోవాలో తెలియజేశారు. అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో డెమో నిర్వహించారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

ఊరూవాడా మార్మోగిన శ్రీరామ నామస్మరణ

తగరపువలస: శ్రీరామనవమి వేడుకలు బుధవారం భీమిలి అర్బన్, రూరల్ పరిధిలోని రామాలయాల్లో కనులపండువగా నిర్వహించారు. ఆదర్శ దంపతులతోపాటు లక్ష్మణుడు, ఆంజనేయస్వామి విగ్రహాలకు బాజాలు, మేళతాళాలు, బాణసంచాతో వీధుల్లో పల్లకీసేవ నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు, పూజల అనంతరం సీతారాములకు కల్యాణ వేడుకలు నిర్వహించారు. జై శ్రీరామ్ నామస్మరణతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం ఆలయాల ఆవరణలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. జీవీఎంసీ పరిధిలో సంతపేట కుమ్మరవీధి, రెడ్డివీధి, చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం, మెయిన్ రోడ్డు, వలందపేట, జీరుపేట, చిల్లపేట, నమ్మివానిపేట రామాలయాల్లో వేడుకలు నిర్వహించారు. భీమిలి మండల పరిధిలో తాళ్లవలస, టి.నగరపాలెం, తాటితూరు, కృష్ణంరాజుపేట, మజ్జివలస, చిప్పాడ, అన్నవరం, పాతపాలెం, మూలకుద్దు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

మధురవాడ: మధురవాడలోని వివిధ ప్రాంతాల్లో సీతారాముల శాంతి కల్యాణం కనులపండువగా, అత్యంత భక్తితో నిర్వహించారు. గణేష్‌నగర్‌లోని విజయ గణపతి పంచాయతన దేవాలయంలో సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ శ్రీనివాస్, నక్కాన శ్రీనివాస్, రంధి నాయుడు, కూన రమణ, చంద్రశేఖర్, లోకనాథం, వెంకటరావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐటీ సెజ్ జంక్షన్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహాకామేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని భద్రాద్రి రాముడు ఆలయంలో అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, తదితరుల ఆధ్వర్యంలో, మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలో ధర్మకర్త నరసింహమూర్తి, చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ కాలనీలో గల రామాలయంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధనను పోతిన హనుమంతురావు ప్రారంభించారు.

కొమ్మాది: శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాములు కల్యాణం వాడవాడలా బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. భీమిలి బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో సీతారాముల కల్యాణం కనులపండువగా సాగింది. సాగర్‌నగర్ వీధుల్లో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమంతుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో ఊరేగించారు. ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలోకి ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆహ్వానం పలికారు. అనంతరం కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. 100 మంది దంపతులు ప్రత్యక్షంగా కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

- జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ, సాగర్‌నగర్ రామాలయాల్లో నిర్వహించిన సీతారామ కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి తదితరులు పాల్గొన్నారు.
- 4వ వార్డులో మంగమారిపేట వారిజా ఆశ్రమం, కాపులుప్పాడ రామాలయంలో, హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో సీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

భీమునిపట్నం: శ్రీరామ నవమి సందర్భంగా బోయివీధి, రొట్టెల వీధి, సుభాష్ రోడ్డు ప్రాంతాల్లోని రామాలయాల్లో సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై వేడుకల్లో పాల్గొన్నారు. మెయిన్ రోడ్డులోని షిర్డీ సాయి బాబా ఆలయం వద్ద సీతారాముల కల్యాణంతోపాటు బాబా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోరాడ, కృష్ణాపురం, పొట్నూరు, ఐనాడ గ్రామాల్లో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఐనాడ రామాలయంలో గతంలో కలశ పూజ నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి సీతారాముల కల్యాణానికి శ్రీకారం చుట్టారు. వేడుకల్లో భాగంగా ఈ గ్రామాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. కోరాడలో కల్యాణంలో వైస్ ఎంపీపీ కోరాడ మంజు భార్గవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు పాల్గొని పూజలు చేశారు. ఐనాడలో అన్నదానాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు మామిడి శివ రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కోరాడ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

మద్ది గ్రామంలోని రామాలయంలో బుధవారం రాత్రి సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. అనంతరం కల్యాణం జరిపారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు తులసి లక్ష్మి, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ పాల్గొన్నారు.

పీఎం పాలెం: స్థానిక మూడో బస్టాప్ సమీపంలోని సీతారామ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పీఎం పాలెం చుట్టుపక్కల కాలనీలకు చెందిన వేలాది మంది రామభక్తులు కనులారా కల్యాణం తిలకించారు. ఉత్సవ నిర్వాహకులు భక్తులకు వడపప్పు, బెల్లం పానకం పంపిణీ చేశారు. సంప్రదాయం ప్రకారం గుర్రపు బగ్గీపై ముత్యాల తలంబ్రాలను వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. సీతారాముల కల్యాణం అనంతరం వేలాది మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.



చిట్టివలస జ్యూట్‌మిల్లు సీతారాముల ఆలయంలో కల్యాణ వేడుకలు



గణేష్‌నగర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



కోరాడలో కల్యాణంలో వైస్ ఎంపీపీ మంజు భార్గవి, లక్ష్మణరావు



సీతారాములకు ముత్యాలు తలంబ్రాలు సమర్పిస్తున్న గాదె రోశిరెడ్డి, తదితరులు



ఐనాడలో అన్నదానం చేస్తున్న నాయకులు



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న నిర్వాహకులు



తాళ్లవలసలో సీతారాముల ఊరేగింపు వేడుకలు



సీతారాముల కల్యాణంలో ఎంపీపీ రాంబాబు, తదితరులు



అలంకరణలో తాళ్లవలస సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయుడు



చంద్రంపాలెంలో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు



ఇస్కాన్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు



షిర్డీ సాయి ఆలయంలో జరుగుతున్న సీతారాముల కల్యాణం

అభివృద్ధికి ఓటేద్దాం

కొమ్మాది: గత ఐదేళ్లలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి ఓటు వేద్దామంటూ జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దరి అమరావతినగర్‌లో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు పోతిన ఎల్లాజీ, వరలక్ష్మి, అవతార్‌సింగ్, మడక ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



అమరావతినగర్‌లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

జాతీయ పోటీలకు ఆర్‌వీ పురం హైస్కూల్ విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులు కర్రి దివ్య, టి.చరణ్, ఎస్.తనోజ్ కుమార్ ముంబయిలో జరగనున్న జాతీయ మినీ హ్యాండ్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ నెల 14న తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున ఆడేందుకు ఎంపికయ్యారని హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వీరిని పాఠశాల విద్యా కమిటీ కో – ఆప్షన్ మెంబర్ మరగడ అప్పారావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.రవి కుమార్, రెడ్డిపల్లి శంకరరావు, ఉపాధ్యాయులు కర్రోతు కృష్ణ, కాళ్ల శ్రీను, బూర్లె రామునాయుడు, సింహాచలం, వెంకటేష్ అభినందించారు.



జాతీయ మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైన ఆర్‌వీ పురం హైస్కూల్ విద్యార్థులు

మ్యాన్‌రెడ్డికి అభినందనలు

తగరపువలస: సికింద్రాబాద్ రైల్వే గ్రౌండ్‌లో ఈ నెల 13న జరిగిన ఆల్ ఇండియా ఓపెన్ వెటరన్స్ అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో చిట్టివలసకు చెందిన రిటైర్డ్ మేజర్ సుబేదార్ మ్యాన్‌రెడ్డికి బంగారు పతకం లభించింది. ఈ సందర్భంగా ఆయన్ను చిట్టివలసలోని మ్యాన్‌రెడ్డి ఫిజికల్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. గతంలో దేశ వ్యాప్తంగా జరిగన పోటీల్లో అథ్లెటిక్స్‌లో పలు పతకాలు సాధించిన ఆయన భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.



చిట్టివలసలో మ్యాన్‌రెడ్డిని అభినందిస్తున్న ఫిజికల్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు

టీడీపీ జెండాలు కట్టేందుకు అమ్మవారి చెట్టు కూల్చివేత

తగరపువలస : జీవీఎంసీ రెండో వార్డులో టీడీపీ నాయకులు మంగళవారం వేప చెట్టు కొమ్మలు నరికివేయడం వివాదాస్పదమైంది. ఆ పార్టీ ప్రచారంలో భాగంగా పసుపు జెండాలు కట్టడానికిగాను ఏళ్ల తరబడి పెరుగుతున్న అమ్మవారి వేపచెట్టు కొమ్మలు నరికేశారు. దీంతో అపచారం జరగడంతోపాటు ఈ ప్రాంత వాసులకు నీడ లేకుండా చేశారని సంగివలస వాసులు వాపోతున్నారు.



సంగివలసలో టీడీపీ నాయకులు కూల్చిన అమ్మవారి వేపచెట్టు కొమ్మలు

మత్స్యకారులను గుండెల్లో పెట్టుకునే నేత సీఎం జగన్

- మరోసారి ముఖ్యమంత్రి అయితే అన్ని వర్గాలకూ మరింత మేలు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస : మత్స్యకారులను గుండెల్లో పెట్టుకునే నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం సాయంత్రం భీమిలి మండలం పెద నాగమయ్యపాలెం, చిన నాగమయ్యపాలెం, పాతపాలెం, జీరుపాలెం గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పేదవాడు గెలవాలంటే తప్పనిసరిగా సీఎం జగన్ మరోమారు ముఖ్యమంత్రి కావాలన్నారు. గత పదేళ్లలో టీడీపీ నాయకులు ఈ మత్స్యకార గ్రామంలో పర్యటించిన సందర్భాలు లేవన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో లబ్ధి కోసం, నాలుగు రూపాయాలు చేతిలో పెట్టి ఓట్లు వేయించుకోవడానికి టీడీపీ నాయకులు వస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

భీమిలిలో మత్స్యకారులకు రూ.28 కోట్లతో జెట్టీ నిర్మాణానికి సీఎం జగన్ భూమి పూజ చేశారన్నారు. త్వరలో దాని నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన కోలా గురువులు, మోపిదేవి వెంకటరమణ, పేర్ల విజయచందర్, సీదిరి అప్పలరాజు, తదితరులకు సీఎం జగన్ ఉన్నత పదవులు కల్పించారన్నారు. మత్స్యకారులకు నష్టపరిహారం రూ.10 లక్షలకు పెంపు, డీజిల్ సబ్సిడీ పెంపు, ఏటా రూ.10 వేల మత్స్యకార భరోసా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులను విడిపించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు అగ్నిప్రమాదానికి గురైతే 48 గంటల్లోనే 80 శాతం నష్ట పరిహారం రూ.40 కోట్లు బాధితులకు పంపిణీ చేశామని గుర్తు చేశారు. మండలంలో ఎక్కువగా సంక్షేమ పథకాలు ఈ పంచాయతీకే అందించామన్నారు. రూ.25 కోట్ల విలువైన సంక్షేమ పథకాలు, రూ.2.50 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, పంచాయతీ అధ్యక్షుడు బొడ్డు దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు తోట ఎల్లారావు, దూడ ధనంకొండ, బడే ఎల్లారావు, సత్తిరాజు, వ్యవసాయశాఖ జిల్లా సలహా మండలి చైర్మన్ దాట్ల పెద బాబు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, శిరిగుడి ఈశ్వరరావు, దుంపల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



పెద నాగమయ్యపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సభకు హాజరైన పెదనాగమయ్యపాలెం మత్స్యకారులు



చిన నాగమయ్యపాలెంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు హారతిస్తున్న మహిళలు



పాతపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పీఎం పాలెం : వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ ఆరో వార్డులోని సాయిరామ్ కాలనీ దుర్గాలమ్మ గుడి వెనుక శాంతమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి ఆమెను అదుపులోకి తీసకున్నారు. ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అదే కాలనీలో దారపు నరసమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి 14 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

సాయిరాం కాలనీలో అగ్నిప్రమాదం



సాయిరాం కాలనీలో చెలరేగుతున్న మంటలు

కొమ్మాది : స్థానిక సాయిరాం కాలనీలో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక మణికంఠ చికెన్ సెంటర్‌లో సాయంత్రం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో క్షణాల్లో చికెన్ సెంటర్ బూడిదైపోయిందని యజమాని సుబ్బారావు తెలిపారు. సమీపంలో శ్రీరామ మందిరం ఉండటంతో అక్కడకు వచ్చిన భక్తులు పార్కింగ్ చేసిన రెండు ద్విచక్ర వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.